క్లుప్తంగా

పెరిగిన జ్వరపీడితులు



గూడూరు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ శనివారం జ్వరపీడితులతో నిండిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెతో వీధుల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయింది. దీంతో దోమల బెడద పెరగడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. రెండు రోజులుగా మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ప్రతీ రోజు 50మంది నుంచి వంద మంది వరకు జ్వరంతో బాధపడుతున్న రోగులు వస్తున్నారని సూపరింటెండెంట్ వీరన్న తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలో ఓ పత్రికలో పనిచేస్తున్న విలేకరిపై దాడి చేసిన ఘటనలో శనివారం ముగ్గురిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఫిర్యాదు మేరకు విచారణ జరిపి దస్‌సింగ్‌తండాకు చెందిన జగన్, రమేష్, నరేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి శివారు ధూమ్యా తండాలో శనివారం ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో 20 లీటర్ల నాటుసారా, 500 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసి గుడుంబా తయారీ సామగ్రిని స్వాధీనపరుచుకున్నారు. గుడుంబా తయారీకి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మరిపెడ సీఐ రాజు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హరీశ్, రజిత, తొర్రూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు, ఎస్సై రవళి, సిబ్బంది రబ్బాని, ఈశ్వర్, సత్యప్రసాద్, యాదగిరి ఉన్నారు.

బాధితులకు సాయం



మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో వరద బాధితులకు, మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆదేశాలతో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి, ఎమ్మెల్యే తనయుడు సూర్యచంద్ర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, నాయకులు వెంకన్న, మురళీధర్‌రెడ్డి, రవి, జనార్దన్, కౌన్సిలర్లు జనార్దన్, జ్యోత్స్నశివ, ఇందిర వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

నెల్లికుదురు: మీడియా, విద్యార్థి సంఘాల నాయకులు బడుల్లోకి రాకూడదని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, తన వైఖరిని మార్చుకోవాలని మహాత్మా జ్యోతిరావు పూలే యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరగాని భిక్షపతిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థలో పెను మార్పులు చేస్తానన్న సీఎం మాయమాటలతో నమ్మించాడని ప్రజలు అర్థం చేసుకొని తిరగబడతారనే ఉద్దేశంతో ఇలాంటి ఆదేశాలు ఇచ్చాడన్నారు.

పంటపొలాలను సందర్శించిన ఎంపీ



బయ్యారం: మండలంలోని నామాలపాడు గ్రామ పరిధిలో ఇటీవల కురిసిన వర్షానికి నష్టపోయిన పంటపొలాలను ఎంపీ మాలోత్ కవిత శనివారం సందర్శించారు. నామాలపాడుకు చెందిన రైతు బాలకృష్ణకు చెందిన మూడు ఎకరాల భూమిలో పంట పొలం కొట్టుకపోవడంతో పొలాన్ని ఆమె సందర్శించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. తక్షణమే సాయం అందజేయాలని కోరారు.

వరదలతో అస్తవ్యస్తం

డోర్నకల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డోర్నకల్ బ్యాంక్ స్ట్రీట్, సాయినగర్ మెయిన్ రోడ్డులో సైడు కాల్వలో నీరు నిలిచి తీవ్ర దుర్గంధం, దోమలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

నెలకొరిగిన 96విద్యుత్ స్తంభాలు

గార్ల: గార్ల పాకాల ఏటి పరివాహక ప్రాంతాల్లో వరద ఉధృతికి సుమారు 96 విద్యుత్ స్తంభాలు నేలమట్టం కాగా, 156 ఎకరాల పంటపొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గండ్లను పూడ్చాలి

గార్ల: గార్ల మండలం ముల్కనూరు పంచాయతీలో గల కట్టు కాల్వకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాలుగు చోట్ల పడిన గండ్లను ఇరిగేషన్ అధికారులు వెంటనే పూడ్చాలని ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన రైతులతో కలిసి కట్టు కాల్వకు పడిన గండ్లను పరిశీలించారు.

పొలాల్లో ఇసుక మేటలు

మరిపెడ రూరల్: మండలంలోని ధక్మాతండాలకు చెందిన రైతులు బానోతు శివ, దారావత్ వెంకన్న, మహేష్, బాలాజీ, భూక్య కిషన్ తదితర రైతుల వరి క్షేత్రంలో పాలేరు వాగు ప్రవాహంతో భూముల్లో రాళ్ల తేలడంతోపాటు ఇసుక మేటలు పెట్టాయి. ప్రభుత్వం స్పందించి ఇసుక మేటలు తొలగించేలా చర్యలు చేపట్టాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

పేరుకపోయిన చెత్తాచెదారం

కురవి: మండల కేంద్రంలోని గొల్లగుట్ట బజార్‌లో చెత్తాచెదారం పేరుకపోయి కంపుకొడుతోంది. పంచాయతీ అధికారులు కొంత మంది పనివాళ్లను పెట్టి చెత్తను తొలగిస్తున్నప్పటికీ చెత్త పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలోని కనికెళ్లబంధం, భద్రయ్య కుంటలకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అలుగు కోతకు గురికాగా, కట్టకు పగుళ్లు ఏర్పడడంతో శనివారం నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు.

బావిలోకి కుంగిన రక్షణ గోడ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కురవి మండల కేంద్రం శివారులో ఖమ్మం జాతీయ రహదారి శనివారం కోతకు గురైంది. కురవికి చెందిన నూతక్కి నర్సింహారావుకు చెందిన తోట వద్ద జాతీయ రహదారికి ఆనుకుని వ్యవసాయ బావి ఉంది. కురిసిన వర్షాలకు బావి అంచు మట్టి బావిలోకి కూలిపోయింది. హెచ్చరిక బోర్డులు పెట్టి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

చెరువు కట్టలు, రోడ్లకు మరమ్మతులు

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి గ్రామంలో చెరువు మత్తడి పోయడంతో వరద నీటి ప్రవాహానికి తారు రోడ్డు కొట్టుకపోయింది. ఈమేరకు శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుపై మరమ్మతు పనులు చేపట్టారు. అదేవిధంగా అర్పనపల్లి గ్రామంలో సర్పంచ్ గంధసిరి స్వరూప, అధికారులు పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు.

చెత్త తొలగింపు

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామ సమీపంలో గల పాలేరు వాగు బ్రిడ్జి పై శనివారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంటేశ్వరరెడ్డి జేసీబీ సహాయంతో చెత్తను తొలగించారు.



కేసముద్రం: వెంకటగిరి రోడ్డుకు మరమ్మతులు



దోర్నకల్: సాయినగర్‌లో ఇళ్ల మధ్య మురుగు



దంతాలపల్లి: బ్రిడ్జిపై చెత్త తొలగింపు..



మరిపెడ రూరల్: అజ్మీర తండాలో కోతకు గురైన పంట భూములు



కురవి: శివారులో రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావి రక్షణ గోడ



నేలమట్టమైన విద్యుత్ స్తంభం

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ కోసం రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కోండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని కేంద్ర మంత్రి నారాయణస్వామి పార్లమెంట్‌లో మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో శ్రీను, రాధా, సుధా, నాయకులు దేవి, ఉపేందర్, రమా, బాలరాజు, బాబు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: గ్లోబల్ పీస్ ఫౌండేషన్ బాలు నాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానుకోట మున్సిపల్ పరిధిలోని సాలార్ తండాలో శనివారం గిరిజన నిరుపేదలకు మదర్ థెరిసా మెమోరియల్ జాతీయ అవార్డు గ్రహీత బాలునాయక్ నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గుగులోత్ వేణుగోపాల్, సలహాదారులు సురేందర్ నాయక్, కోశాధికారి రాంబాబు నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కురవి: సీరోలు మండల కేంద్రంతోపాటు రేకుల తండా గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తగరం శ్రీరామ్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో రైతులు జలగం ధర్మయ్య, రామనర్సమ్మ, శంకర్, బాలోజీ, వీరన్న పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



కేసముద్రం: రంగాపురంలో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కేసముద్రం: వరద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని అర్పనపల్లి గ్రామంలో వట్టివాగు వరదకు గురైన వడ్డెర కాలనీలోని ఇళ్లను పరిశీలించారు. అనంతరం 40 బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. వట్టివాగు సమీపంలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో 18మందికి రూ.5లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి, పాత తండాలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. రంగాపురం గ్రామంలో వరద నీటికి కొట్టుకపోయిన రహదారిని పరిశీలించి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం దుర్గేష్, పార్టీ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అర్పనపల్లి సర్పంచ్ స్వరూప పాల్గొన్నారు.

'ఒక్క సీటు కూడా గెలవనివ్వొద్దు'



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

నెహ్రూసెంటర్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను జిల్లాలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా గెలవనివ్వకుండా ప్రజలు బుద్ధి చెప్పాలని తీన్మార్ మల్లన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ మరోసారి అధికారంలోకి వస్తే మన ఒంటిమీద బట్టలు కూడా ఉండవని విమర్శించారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, ప్రజల భవిష్యత్‌ను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ప్రజలు ఓటు విలువ తెలుసుకుని బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా గుణపాఠం చెప్పాలని కోరారు.

ఊరూరా మొహర్రం వేడుకలు



మహబూబాబాద్ రూరల్: ఊరేగింపులో పాల్గొన్న బలరాంనాయక్



దోర్నకల్‌లో పీరీల ఊరేగింపు..



మరిపెడ రూరల్: అజ్మీరతండాలో..

ముస్లింల ప్రధాన పర్వదినాల్లో ఒకటైన మొహర్రం పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇమామ్ హసేన్, ఇమామ్ హుస్సేన్ సహా పలువురి ముస్లిం వీరుల స్మారకార్థం త్యాగాలను పీరీల రూపంలో తయారు చేసి వాటికి తొమ్మిది రోజులు ప్రార్థనలు చేసి పదో రోజు అర్ధరాత్రి వరకు ఊరేగించి, తెల్లవారు జామున సవార్లకు నీటిలో నిమజ్జనం చేస్తారు. - సాక్షి నెట్‌వర్క్

ఎమ్మెల్యేను కలిసిన హజ్ యాత్రికులు



చిన్నగూడూరు: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హజ్ యాత్రికులు

చిన్నగూడూరు: హజ్ యాత్రికులు ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను ఉగ్గంపల్లిలో తన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. నాయకుడు ఆయూబ్‌పాషా, నాయకులు, ముస్లింలు ఉన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

మరిపెడ రూరల్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మరిపెడ మండలానికి చెందిన ముస్లింలు పలువురు ఇటీవల హజ్ యాత్ర వెళ్లి వచ్చారు. ఈసందర్భంగా నవీన్‌ను శనివారం మర్యదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు జహంగీర్ సాబ్, మజీద్ సదద్ రజబ్ అలీసాబ్, మరిపెడ మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మజీద్, నాయకులు షాబుద్దీన్, అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



బయ్యారం: ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న కార్మికులు



గూడూరులో అర్ధనగ్న ప్రదర్శనలో పంచాయతీ కార్మికులు

బయ్యారం: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె శనివారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. శిబిరంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు.

జీపీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

గూడూరు: మండల కేంద్రంలో సమ్మె చేపట్టిన గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు శనివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, సత్యనారాయణ, మోహినొద్దీన్, రాజు, వీరమల్లు, ఐలయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం

నెహ్రూసెంటర్: గ్రామ పంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ సమావేశం నిర్వహించారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 31న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి అప్పిరెడ్డి, జిల్లా నాయకులు జానీ, మజూర్, అలీ, వీరన్న, లతీఫ్ పాల్గొన్నారు.

గార్ల: గార్లలో గ్రామ పంచాయతీ కార్మికులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె.శ్రీనివాసరావు, కార్మికులు అప్పిరెడ్డి, దస్తగిరి, దాసు, భద్రు, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆగస్టు 2నుంచి చైతన్య యాత్ర

కురవి: అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర ఆగస్టు 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న అన్నారు. శనివారం సీరోలు మండల కేంద్రంలో యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, గోవర్ధన్, వెంకటనారాయణ, నాగరాజు, మధు, నాగన్న పాల్గొన్నారు.

పాడిగేదె మృతి

గూడూరు: మండల సమీపంలోని చంద్రుని చెరువు వద్దకు మేత కోసం గేదెలు వెళ్లాయని బాధిత రైతు శాబోద్దీన్ తెలిపాడు. వర్షాల కారణంగా చెరువు నిండుకొని గుంతలు ఉండడంతో అందులోకి వెళ్లిన గేదె మృతిచెందినట్లు పేర్కొన్నాడు. దాని విలువ సుమారు రూ. 55 వేలు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశాడు.

గ్రామాల పరిశీలన

దంతాలపల్లి: రానున్న ఎన్నికల నైపథ్యంలో ఎస్సై రమేష్‌బాబు, ఆర్‌ఐ నిజాముద్దీన్‌తోపాటు సెక్టార్ అధికారులు మండలంలోని పలు గ్రామాలను పరిశీలించారు. ప్రజలను ఓట్లు వేయకుండా ఎవరైనా ప్రభావితం చేస్తున్నారా.. కుల మత ద్వేశాలు రెచ్చగొట్టారా అనే అంశాలపై గ్రామప్రజలతో ఆరాతీశారు.

ఓటు హక్కుపై అవగాహన

కురవి: సీరోలు మండల పరిధిలో పలు పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఓటు హక్కుపై సీరోలు తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఏఈ చైతన్య, ఏఎస్సై నాగయ్య పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీస్ తరలించొద్దు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని పత్తిపాక కాలనీలో ఉప తపాలా కార్యాలయానికి నూతన కలెక్టరేట్ సమీపంలో మార్చేందుకు చూస్తున్నారని మార్చకుండా చూడాలని కాలనీవాసులు సిరిపురం వీరన్న, శ్రీను, మహేందర్‌తో పాటు పలువురు శనివారం జిల్లా కేంద్రంలో ఎంపీ మాలోత్ కవితకు వినతిపత్రం అందజేశారు. వెంటనే ఎంపీ సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యశిబిరం

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కురవి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విరాజిత, మేట్రిన్ పద్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కొత్తగూడ: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఆరుతడి పంటలను మండల వ్యవసాయాధికారి జక్కుల ఉదయ్ శనివారం పరిశీలించారు. వివరాలను ఏఈఓ క్లస్టర్ వారీగా సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఏఓ రైతులకు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

డోర్నకల్: వర్షాలు, వరదలతో ధ్వంసమైన రోడ్లు, చెరువు కట్టల మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగు వద్ద వరదతో కోతకు గురైన బ్రిడ్జి రోడ్డును శనివారం లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవా, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంతోపాటు కోమటిపల్లి గ్రామంలో వర్షాలకు పలువురి ఇళ్లు కూలగా బాధిత కుటుంబాలను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత డాక్టర్ మురళీనాయక్ పరామర్శించి ఆర్థికసాయం అందజేశాడు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, కేసముద్రం సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, ఎండీ.ఖలీల్, గంధసిరి శ్రావణ్, సర్పంచ్ ఇస్లావత్ బాలు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెంకు చెందిన వీఆర్‌ఏ కొత్తూరు లక్ష్మి ఇటీవల మృతిచెందారు. విషయం తెల్సుకున్న రిటైర్డ్ టీచర్ నాయిని వెంకటేశ్వర్లు శనివారం బాధిత కుటుంబానికి రూ.3వేల ఆర్థికసాయం అందించారు.

లోలెవల్ కాజ్‌వే మంజూరు చేయాలి

గూడూరు: మండలంలోని కోబల్‌తండా శివారులో దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేను తొలగించి కొత్తగా మరో కాజ్‌వే ఏర్పాటు చేయాలని సర్పంచ్ కమల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. భారీగా కురిసిన వర్షానికి మండలంలోని కోబల్‌తండా శివారు రహదారిలోని లోలెవల్ కాజ్‌వేపై రంధ్రం పడి, కొంత దూరం బీటీ రోడ్డు కొట్టుకుపోయి ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

నర్సింహులపేట: నర్సింహులపేటకు చెందిన ఉమేష్ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉమేష్ మృతి చెందాడు. తల్లి వీరసోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి

నెహ్రూసెంటర్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించి రాష్ట్ర ప్రభుత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు యనమల కిరణ్, నాయకులు చీపిరి యాకయ్య, మందుల మహేందర్, నూనే శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి

కురవి: దివ్యాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, పథకాల్లో ఐదు శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, సీతయ్య, బంగారి, వెంకన్న, సుశీల పాల్గొన్నారు.

విజృంభిస్తున్న కళ్ల కలకలు

కొత్తగూడ: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కొత్తగూడ, గంగారం మండలాల్లో కళ్ల కలకలు విజృంభిస్తున్నాయి. ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తుండడంతో గ్రామాల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నటుండి ఒక్కసారిగా కళ్లు ఎర్రబారి పోతున్నాయి. నీరు కారడం, మంటలు, దురద వచ్చి కళ్లు వాస్తున్నాయి. లక్షణాలు కనిపించిన వ్యక్తిని మరో వ్యక్తి చూసిన కొద్ది క్షణాలకే అతనికి వచ్చేస్తుంది. వ్యవసాయ పనుల సమయంలో ఈ వైరస్ రావడంతో పనులు చేసుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు రైతులు అంటున్నారు. ఇదిలా ఉంటే గంగారం మండలం మడగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కొత్తగూడ మండలకేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు కళ్ల కలకలతో బాధ పడుతున్నారు. కంటి చుక్కల మందు వేసినా తగ్గడం లేదని బాధితులు అంటున్నారు. పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన ఆర్‌బీఎస్‌కే సిబ్బంది మాత్రం కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కళ్ల కలకలతో బాధ పడుతున్న భద్రమ్మ

విశ్రాంతి తీసుకోవాలి

కన్‌జెక్టివైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో కళ్ల కలకలు వస్తున్నాయి. వీటికి యాంటి బయాటిక్ కంటి చుక్కలు, మందులు వాడితే తగ్గి పోతుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ కాబట్టి దాని ప్రభావం మూడు, నాలుగు రోజులు ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ వచ్చిన వారు కళ్లు రుద్దడం, నలవడం చేయకుండా మందులు వాడాలి. పాఠశాలల్లో క్యాంపులు నిర్వహించాం. మందులు ఇచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశాం. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశాల కార్యకర్తలతో మందులు ఇప్పిస్తున్నాం.

- డాక్టర్ శివప్రసాద్, కొత్తగూడ

పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్



మహబూబాబాద్ రూరల్: నిరుపేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కాలనీలో శనివారం సుమారు 100 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, గూడూరు మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్ నాయక్, కత్తి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.